

సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
కర్నూలు నంద్యాల
శనివారం | 03 మే 2025
పేజీలు 8

# బేతంచెర్లలో దారుణం

## - కుక్కల దాడిలో పసి బాలుడు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడు



**బేతంచెర్ల ,మేజర్ న్యూస్ :** బేతంచెర్ల పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనిలో న చివాలయం సమీపాననివాసం ఉన్నహుస్సేన్ భాష, ఆశ దంపతులకు ఇద్దరు కుమారులు,కూతురు కలదు. చిన్న కుమారుడు మోహిద్దీన్ (4) శుక్రవారం సాయంత్రం అదే కాలానికి చెందిన చిన్నారులతో ఆడుకుంటూ కాలానికి సమీపాన ఉన్న ఖాళీ ప్రదేశానికి వెళ్లగా వీధి కుక్కలు దాడిచేసి లాక్కెళ్లిపోయి శరీర భాగాలపై తీవ్రంగా దాడిచేయడంతో మృతి చెందాడు. చింత చిగురుకు వెళ్లిన ఓ మహిళ విగతజీవిగా పడివున్న బాలుణ్ణి చూసి పలువురికి సమాచారం ఇచ్చింది. గుర్తించిన స్థానికులు తల్లిదండ్రులకు తెలిపారు. అల్లారుముద్దుగా పెంచుకున్న పసిభాలుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తుండడం పలువురున్నీ కంట తడి పెట్టించాయి. విషయం తెలుసుకున్న ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి,చైర్మెన్ సి. హెచ్ చలం రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. చైర్మెన్ సిహెచ్ చలం రెడ్డి మాట్లాడుతూ

మిగతా 2లో

**ఆదోని టౌన్,ఆత్మకూరు, మేజర్ న్యూస్:** బొలేరా వాహనం అదుపు తప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బైర్లూటి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఆదోని పట్టణంఇందిరా నగర్ కు చెందిన భక్తులు శ్రీశైలం నుంచి బొలేరా వాహనంలో వస్తుం డగా బైర్లూటి,ఎస్ఎన్ తాండా మధ్యలో వర్షం కారణంగా

మిగతా 2లో

## దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

- శ్రీశైలం నుంచి ఆదోనికి తిరుగుప్రయాణంలో బ్రేకులు ఫెయిల్ అయ్యి అదుపుతప్పి వాహనం బోల్తా
- నలుగురు దుర్మరణం
- మృతులంతా ఆదోని వాసులే..

# ఘోర ప్రమాదం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆదోని వాసులు

# భూ వివాదాలే లక్ష్మీనారాయణ హత్యకు కారణం

- చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యకేసులో ప్రధాన ముద్దాయిలు అరెస్టు
- ఏప్రిల్19న హత్యకు కుట్ర..చీకటి కావడం వల్ల వాయిదా..
- ఏప్రిల్27న పక్కా ప్రణాళికతో హత్య..
- భూ సెటిల్‌మెంట్‌లు, ఆధిపత్యపోరులే హత్యకు కారణాలు..
- వైకుంఠం కుటుంబానికి ప్రస్తుతం ఈ కేసులో సంబంధం లేదన్న పోలీసులు
- గౌరియా,పూనగొండ్ల రాజేష్,కత్రిమల్ల పెద్దన్న ప్రధాన నిందితులు
- మృతుడు లక్ష్మీనారాయణ,ముద్దాయిల మధ్య ఉన్న వివాదాలే హత్యకు కారణం
- చిప్పగిరిలో పోలీసు పికెట్ తొలగింపు ఆరోపణలు అవాస్తవం

2లో


ముద్దాయిలను అరెస్టు చూపుతున్న ఏఎస్పి, డిఎస్పిలు

## శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం

# ధ్వంసం


దుండగుల చేతిలో ధ్వంసం అయిన హనుమాన్ విగ్రహం

- ముగ్గురు వ్యక్తుల పన్నాగం
- బకరిని పట్టుకొని పోలీసులకు అప్పగింత
- కేసు నమోదు చేసుకొని విచారణ..?

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఎమ్మిగనూరు పట్టణ శివారులో ఉన్న ఐ. కొండ పై ఇటీవలనే శ్రీ అంజినేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ట చేపట్టారు. అయితే శుక్రవారం ముగ్గురు యువకులు

మిగతా 2లో

## నీట్ పరీక్షలను అత్యంత సమర్థవంతంగా

# నిర్వహించండి

- ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు..
- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా


2లో
సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

## ఎగువ అహోబిలంలో

# వైభవంగా ధ్వజారోహణం


2లో

## జ్వాలాపురం గ్రామంలో

# ఉన్నతాధికారుల పర్యటన


7లో
జ్వాలాపురం పర్యటిస్తున్న ఉన్నతాధికారుల బృందం

సూర్య www.suryaa.com



## దైవ దర్శనానికి వెళ్లి వస్తూ.. ఘోర ప్రమాదం

(మొదటి పేజి తరువాయి)

బ్రేక్‌లు సరిగా పడకపోడంతో భారీ రోడ్డ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో చంద్రమ్మ(31), గిడ్డయ్య(42), శశికళ(40), లక్ష్మి(28) అనే వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలైన మరో 14 మందిని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడా రాజశేఖర్ రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తు గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# బేతంచెర్లలో దారుణం

(మొదటి పేజి తరువాయి)

పట్టణానికి చెందిన జంతు ప్రేమికుడు కుక్కల నియంత్రణకు అధికారులుచర్యలు తీసుకోవడంతో చట్టపరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు. అయితే ప్రజల అభిప్రాయం మేరకు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**కుక్కల దాడిలో చనిపోయిన చిన్నారి కుటుంబానికి 25 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి..భార్గవ్ సిపిఐ మండల కార్యదర్శి డిమాండ్ :** బేతంచెర్ల మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన తల్లి ఆశాబీ తండ్రి హుస్సేన్ బాషాల కుమారుడు సయ్యద్ మొహిద్దిన్ (4) అనే బాలుడు కుక్కల దాడిలో మరణించడం చాలా బాధాకరమైన విషయమని అన్నారు. చిన్నారి మృతికి సిపిఐగా దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తక్షణమే ప్రభుత్వ అధికార యంత్రాంగం స్పందించి బాలుని మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకొని కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో కుటుంబంతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

## నీట్ పరీక్షలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించండి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** దేశ వ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షలను అత్యంత సమర్థ వంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చీఫ్ సూప రింటెండెంట్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్ల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈనెల 4వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) పరీక్షలు జిల్లాలో ప్రథమంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో ఉన్న గవర్నమెంట్ హైస్కూల్, టెక్కె జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తదితర కళాశాలలో 1172 మంది విద్యార్థులు నీట్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, తదితర గుర్తింపు కార్డులతో పాటు పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తారన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల తరువాత విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రతి పరీక్షా కేంద్రంలో 2వీల్ చైర్లను ఏర్పాటు చేయాలన్నారు. పరీఓఆ కేంద్రాల పరిధిలో ఏ ఒక్క చిన్న సంఘటన జరగకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. కస్టోడియన్ బ్యాంకుకు వచ్చిన పరీక్ష పేపర్లను పోలీసుల సహకారంతో తీసుకురావాలన్నారు. పట్టణంలో అభ్యర్థులకు ట్రాఫిక్‌వల్ల ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జీరాక్స్ షాపులు మూసి ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, తగిన వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. సెల్‌పోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలలోకి అనుమతి లేదని తెలిపారు. అనంతరం నీట్ పరీక్షలపై పాటించాల్సిన నియమ, నిబంధనలపై జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లకు వివరించారు.

## ఎగువ అహోబిలంలో వైభవంగా ధ్వజారోహణం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరుగుతున్న వైశాఖమాస శ్రీ నృసింహజయంతి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఎగువ అహోబిలంలో ధ్వజా రోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. గరుత్మంతుని చిత్రపటంతో కూడిన ధ్వజాన్ని ధ్వజస్తంభంపై అవనతం చేశారు. ప్రధానార్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి మాట్లాడుతూ ఉత్సవాలలో ఎలాంటి ఆటంకాలు జరగకుండా శ్రీ మహావిష్ణువు వాహనమైన గరుడని ప్రార్థిస్తూ వేదమంత్రాలు నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే దిగువ అహోబిలంలో శ్రీ భగవద్ రామానుజాచార్ల వారి 1008 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్య ఆధ్వర్యంలో అర్చక బృందం నవ కలశ తిరుమంజన సేవ నిర్వహించారు. అనంతరం భగవత్ రామానుజాచార్యుల వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం మాల వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.





# భూ వివాదాలే లక్ష్మీనారాయణ హత్యకు కారణం

**ఆలూరు,చిప్పగిరి,మేజర్‌న్యూస్:** ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎంఆర్‌పిఎస్ నాయకులు చిప్పగిరి లక్ష్మినారాయణ హత్యకేసులో ముగ్గురు ప్రధాన ముద్దాయిలను ఐ.జి కోయప్రవీణ్,ఎస్పి విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో రాబడిన సమాచారం మేరకు దర్యాప్తు అధికారి అయిన ఏఎస్పి హుసేన్‌పీరా,డిఎస్పి వెంకటరామయ్య,సిఐ. రవిశంకర్ రెడ్డిలతో కలిసి నక్కన దొడ్డి జాతీయరహదారిపై టోల్‌గేట్ వద్ద ప్రధాన ముద్దాయిలు అయిన బేపర్ గౌసియా, పూనుగొండ్ల రాజేష్.కత్రిమల్ల సౌభాగ్యలనుఅరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఆలూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కర్నూలు ఏఎస్పి హుసేన్‌పీరా, పత్తికొండ డిఎస్పి వెంకటరామయ్యలు తెలిపిన వివరాల ప్రకారం గుంతకల్లు కు చెందిన గౌసియా, రాజేష్,పెద్దన్నలకు చెందిన పలు భూ సెటిల్‌మెంట్ పంచాయతీల కేసులలో చిప్పగిరికి చెందిన లక్ష్మినారాయ ణకు మధ్య వివాదాలు గత కొన్నేళ్లుగా నడుస్తున్నాయి.అయితే ఇటీవల ఆలూరు రోడ్డు నందు గాయత్రి ఫంక్షన్ హాల్ నందు ఎకరా పదిసెంట్ల భూ వివాదం,సిద్దార్థ కాలనీలో9 ఎకరాల దేవాదాయ భూమి,పెద్దన్నకు సంభందించిన 8 ఎకరాల భూమిని వారి అత్తపేరుపై ఆన్‌లైన్ అక్రమం గా ఎక్కించడం, చనిపోయిన చిప్పగిరి లక్ష్మినారాయణ ముద్దాయిలపై పలు ఎస్సీ,ఎస్టీ కేసులుతో పాటు ఇతర కేసులు పెట్టడం ఇటీవల బహిర్గంగా దూషించడం వంటి చర్యలు చేపట్టడం వల్ల లక్ష్మినారాయణ తమను ఎక్కువగా వేదిస్తున్నాడని ఇతని అడ్డు తొలగించుకుంటే గుంతకల్లులో తామే ఆధిపత్యం చెలాయించవచ్చని లక్ష్మినారాయణ హత్యకు పథకం పన్నినట్లు పోలీసులు తెలిపారు. ముద్దాయిలు పెద్దన్న ఇంటివద్ద సమావేశమై మనమందరం లక్ష్మినారాయణ నుండి విముక్తి పొందాలంటే హత్య చేయడమే మార్గమని భావించి ఏప్రిల్ 19న పథకం పన్నారు. అయితే డ్రైవర్ మేకల శ్రీనివాసులు లారీతో గుద్దడానికి పథకం పన్నగా లక్ష్మినారాయణ చిప్పగిరికి రావడానికి చీకటి పడడంతో పథకాన్ని వాయిదా వేశారు.అయితే ఏప్రిల్ 27వతేది 10 మంది ముద్దాయిలు కలిసి ముందుగానే కారును ఢీ కొట్టించడానికి కొనుగోలు చేసిన టిప్పర్‌తో గుంతకల్లు బ్రిడ్జి దగ్గరకు చేరుకొని కొంతమంది ముళ్లపొదల్లో మాటువేసిఉండగా లక్ష్మినారాయణ కారును రాజేష్ అనుసరిస్తూ అతని కదలికలను ఎప్పటికప్పుడు అందించగా కారు బ్రిడ్జి దగ్గర స్పీడ్ బ్రేకర్ దగ్గరకు రాగానే మధ్యాహ్నం మేకల శ్రీనివాసులు,ధర్మలు లారీతో స్పీడుగా వచ్చి గుద్దడంతో లారీ ముందు భాగం నుజ్జుఅయి డ్రైవర్ సృహతప్పి పోయాడు.అలాగే వెనుక ఉన్న కరెంటు గోవిందును గుర్తించలేక ముందు సీటులో ఉన్న లక్ష్మి నారాయణ కారు అద్దాలు గుంతకల్లు కు చెందిన వడ్డే నవీన్ ఇనుప రాడ్డుతో అద్దాలు పగలగొట్టి తలపై కొట్టాడు.వెంటనే పెద్దన్న తనవద్ద ఉన్న వేట కొడవలితో తలపై నరికారు.మిగతా ముద్దాయిలు అందరూ చుట్టుపక్కల ఎవ్వరూ రాకుండా చూసుకుంటూ వారితో పాటు రాము బైక్‌పై పరారయినట్లు తెలిపారు. అయితే హత్య చేయబడిన వెంటనే నిందితులకోసం గాలించగా మృతుడు లక్ష్మినారాయణ కేవలం భూ తగాదాలు, సెటిల్‌మెంట్‌లు తదితర కారణాల వల్ల హత్య చేయబడ్డారని నిర్ణయానికి వచ్చి ముగ్గురు ప్రధాన నిందితులు గౌసియా,రాజేష్, సౌభాగ్యలను పట్టుకొని కోర్టుకు హాజరుపరచినట్లుతెలిపారు. మిగతా ఏడుగురు నిందితులను త్వరలోపట్టుకుంటామని ఏఎస్పి తెలిపారు. అలాగే గ్రామంలో పోలీసు పికెట్ ఎత్తివేయలేదని అదిచాలారోజులుగా కొనసాగుతుందన్నారు.

**వైకుంఠం కుటుంబానికి ప్రస్తుతం హత్యతో సంభందంలేదు..:** హత్య చేయబడ్డ లక్ష్మినారాయాణ కుటుంబసభ్యులు ఇచ్చిన పిర్యాదులో వైకుంఠం సోదరులు,వారి అనుచరుల పేర్లు పేర్కొనగా వారు ఎవ్వరూ ప్రస్తుత హత్యలో పాల్గొనలేదని టెక్నికల్‌గా వారి కదలికలను అన్ని చూడగా వారి ప్రమేయం కనబడలేదని ఏఎస్పి హుసేన్‌పీరా తెలిపారు. మృతుడు గతంలో వైకుంఠం దంపతుల హత్య కేసులో ముద్దాయి అయినందున వారిపై అనుమానంతో పిర్యాదులో పేర్కొన్నారని ఎవరికైనా హత్యకేసులో ఎవైనా ఆధారాలు ఉంటే పోలీసులకు తెలపాలని ఎంతటివారినైనా వదిలే ప్రశక్తి లేదన్నారు.అలాగే వారి విరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు దిలీప్ కుమార్, మహబూబ్ భాష,శ్రీనివాసులు,పోలీసులు పాల్గొన్నారు.

# శ్రీ అంజినేయస్వామి విగ్రహం ధ్వంసం



దుండగున్ని పట్టుకున్న స్థానికులు

(మొదటి పేజి తరువాయి)

హనుమంతుని విగ్రహాన్ని ధ్వంసం చేస్తుండగా అక్కడ పనుల్లో ఉన్న వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే వారిలో ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు పరారయ్యారని స్థానికులు తెలుపుతున్నారు. ఒక యువకుడిని పట్టుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు అందరూ విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు భారీ ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని నిందితుల్లో ఒకరు దొరికారు మరో ఇద్దరిని పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు. పరారిలో ఉన్నవారిపై ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు ఆరా తీస్తున్నారు. పెద్దెత్తున పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చిన హిందువులను అక్కడి పోలీసులు శాంతియుతంగా ఉండాలని నిందితులను ఎంతటి వారు అయినా ఉపేక్షించబోమని హామీ ఇవ్వడంతో పాటు కేసు నమోదు చేసుకున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు విచారణలో తెలిన నిందితులను వదిలిపెట్టం అన్నారు.





పోలీస్ స్టేషన్ చేరుకున్న హిందుసంఘాలు

### భారతీయ తత్త్వ చింతనపై చెరగని ముద్ర వేసిన


# ఆచార్యులు ఆదిశంకరులు

**ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు**

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** అద్వైత సిద్ధాంతకర్త ఆదిశంకరాచార్యులు దైవాంశ సంభూతుడని, అతి పిన్న వయసులోనే అపారమైన ప్రజ్ఞ, శాస్త్ర పాండిత్యాని కలిగిన ధీశాలి అని ప్రముఖ సంస్కృత పండితులు, వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు అన్నారు. ఆళ్ళగడ్డ పట్టణం మల్లిఖార్జున శాస్త్రి వీధిలోని శ్రీ ఆదిశంకరాచార్య మందిరం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా వారు శంకరవైభవంపై ప్రవచించారు. ముప్పై రెండు సంవత్సరాల వయసులోనే దేశం నలుచెరగులా పీఠాలను ఏర్పాటు చేసి, ఈ దేశ, సంస్కృతులను కాపాడుటకు కృషి చేసిన కారణ జన్ముడని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, అలంకరణ, గోమాతకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శంకరాచార్య ఆలయ ధర్మకర్త విశ్రాంత జిల్లా న్యాయమూర్తి కాశీభట్ల శివప్రసాద్, బెంగుళూరు ఇన్కమ్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శేష శైలేంద్ర ఐఆర్ఎస్.తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు టి.వి.వీరాంజనేయరావు, జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా సమన్వయకర్త సి.రామకృష్ణ, శ్రీ ఆదిశంకరాచార్య మందిర నిర్వాహకులుకాశీభట్ల వెంకటవిజయలక్ష్మి, అడ్వకేట్ సాయిస్వరూప్,సత్య ప్రసాదు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీఆదిశంకర సేవా సత్సంగ్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో పేదలకు ఆసరా

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పేదలకు కొండంత ఆసరాగా ఉందని పి.లింగాపురం గ్రామ టీడీపీ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డిలు అన్నారు. గ్రామంలో మంజూరైన పింఛన్లను లబ్దిదారులకు వారు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల పక్షపాతిగా పేదల ఆర్థికాభివృద్ధి కోసమే పాటు పడుతున్నారని వారు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెంచిన మొత్తం పింఛన్ మొత్తాన్ని 1వ తేదీన ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌దారులకు అందజేసేలా కూటమి ప్రభుత్వం ముందుకు పోతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, టీడీపీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

# వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలు లేకుండా ప్రత్యేకంగా నీటి వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వేసవిలో మూగజీవాల పశువుల దాహార్తిని తీర్చేందుకు, ఉపాధి హామీ పథకం ద్వారా పొలాలకు వెళ్లే రహదారుల్లో నీటితొట్లు నిర్మించడం జరిగిందని ఏపీవో వసుధ తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు వేతనాలు పెండింగ్ లేకుండా చెల్లిస్తున్నామని వేసవికాలంలో పని చేసే చోట ఉపాధి హామీ కూలీలే చెట్టు వద్ద గాని తాత్కాలిక పద్ధతులు గాని వేసుకోవాలని ఆమె తెలిపారు. అనంతరం పంచాయతీరాజ్ ఏఈ వెంకట్రాముడు మాట్లాడుతాడు గ్రామాల్లో ప్రస్తుతం సిసి రోడ్లో నిర్మించడం జరిగిందని బండి ఆత్మకూరు మండల కేంద్రంలో వివాదాస్పదంగా ఉన్న ప్రధాన రహదారి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి చొరవతో 25 లక్షలతో డ్రైనేజీ రోడ్డు నిర్మిస్తున్నామని ప్రభుత్వం కేటాయించిన అన్ని పనులను త్వరితగతిన చేయిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పద్మావతి ఎంపీడీవో దస్తగిరి మండల పరిషత్ ఉపాధ్యక్షులు రాగల వెంకటరమణ ముంతల మధు రాణి ఎంపీటీసీ సభ్యులు పుల్లయ్య, అర్జున్, వెంకటమ్మ, కోఆప్షన్ సభ్యులు జమాల్ సర్పంచులు కాలూరి శ్వేతకుమారి అధికారులు వ్యవసాయ అధికారి స్వాతి పి ఆర్ ఏ ఈ వెంకట్ రాముడు ఉపాధి హామీ ఏపీవో వ సుధ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీనరసింహ పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుగంగ ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేపట్టాలి

**– నందమూరి ఆశయాన్ని నెరవేర్చాలి**
**– రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి**




తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మాణాలను పంట కాల్వలను తక్షణమే పూర్తి చేయాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. నందమూరి తారకరామారావు ఆశయాన్ని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లా రుద్రవరం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట తెలుగుగంగ ఆయకట్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ సీమలో త్రాగు, సాగునీటి కోసం 80వ దశకంలో చేపట్టిన కరవు బండ ఉద్యమాన్ని గౌరవించి ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగుగంగ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. సీమకు త్రాగు, సాగునీటిని అందించడమే ప్రాజెక్టు లక్ష్యమన్నారు. శ్రీశైలం వెనుక జాలాలను మద్రాస్ త్రాగునీటికి, తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా అందజేయడంతోపాటు 29 టిఎంసిల కృష్ణా జలాలను కర్నూలు, కడప జిల్లాల్లో అనేక గ్రామాలకు త్రాగునీటితోపాటు 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని కల్పించడమే లక్ష్యంతో ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. పెన్నా జలాలను వినియోగించి నెల్లూరు జిల్లాలో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టు, చిత్తూరు జిల్లాలో 0.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలన్న లక్ష్యం తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగానే చేపట్టారన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టుకు కీలకమైన నిర్మాణాలు చేపట్టడంలో విధానాలను అమలు పరచడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. ఎన్టీఆర్ ఆశయం కలగానే మిగిలిపోయిందన్నారు. తెలుగుగంగ మరమ్మత్తులను తక్షణమే పూర్తి చేసి చెరువుల మరమ్మత్తులను తక్షణమే చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం సీమకు బాసటగా నిలవాలన్నారు. అనంతరం తహశీల్దార్ మల్లిఖార్జునరావుకు వినతి పత్రం అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. తెలుగుగంగ ప్రాజె క్టు అధికారులకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రామ గురివిరెడ్డి, పార్థసారథిరెడ్డి, హరికృష్ణ, రామకృష్ణారెడ్డి, మహబూబ్ బాష, దేవానందరెడ్డి, పట్నం రాముడు, రవికుమార్‌రెడ్డి, కొమ్మ శ్రీహరి, తిమ్మారెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి, వీర బ్రహ్మానందరెడ్డి, మహేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సురేష్

**సంజామలమేజర్,న్యూస్:** సంజామల మండలం గిద్దలూరు గ్రామంలోని పుస్తక నిక్షిప్త కేంద్రంలో గ్రంథాలయ నిర్వాహకులు టి. మద్దిలేటి ఆధ్వర్యంలో మే 2వ తేదీ నుండి వేసవి శిక్షణా శిబిరం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ కార్యదర్శి సురేష్ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు గ్రామానికి చెందిన విద్యార్థులు గ్రంథాలయంలో ఒక గంట సేపు కేటాయించి వారికి నచ్చిన పుస్తకాలను చదివిన వారికి లక్కీ లాటరీ ద్వార వారికి పెన్నులు, పెన్సీలు, రబ్బరు, షాప్‌నర్ మరియు బిస్కెట్స్‌ను సురేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బి. వెంకటేష్, ఎం. అబ్రహము గ్రామానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. 2 నుంచి ప్రతిరోజు కొనసాగిస్తూ జూన్ 10వ తేదీ వరకు ఇదే విధంగా వారికి లక్కీ లాటరీ ద్వార పైన తెలిపిన వస్తువులు ఇవ్వడం జరుగును. కావున గ్రామానికి చెందిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాల్సిన సురేష్ తెలిపారు.

# వన్నూరప్పకు మేనేజర్‌గా పదోన్నతి

**– మేనేజర్‌కు ఉద్యోగులతో కలిసి కమీషనర్ సన్మానం**

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని పురపాలక సంఘం పరిధిలో ఈ1 విభాగంలో విధులు నిర్వహిస్తున్న వన్నూరప్పకు మేనేజర్‌గా పదోన్నతి రావడం జరిగింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు ఆయన ఘన సన్మానం చేశారు. ఆదోని నుండి బదిలీల్లోభాగంగా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెం పురపాలక సంఘం మేనేజర్‌గా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. పురపాలక అధికారులు పదోన్నతిపై వెళ్తున్న వన్నూరప్పను పూలమాలలు, శాలువలతో కప్పి కమీషనర్ కృష్ణ, సహాయ కమీషనర్ అనుపమ, ఎంఈ ఇంతియాజ్ బాష, అకౌంటెంట్ రవిచంద్ర, డిఈలు రామ్మూర్తి, గోపినాథ్, మేనేజర్ నిస్సార్ హుసేన్, తదితర సిబ్బంది సన్మానించి ఆయన సేవలు ఎనలేనివన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ కృష్ణ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విభాగం నుండి ఈ1గా విధులు నిర్వహించి పురపాలక అభివృద్ధికి ఎంతో తోడ్పాటును ఇచ్చారన్నారు. ప్రతి ఉద్యోగికి పదోన్నతులు రావడం సర్వసాధారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎఈ జనార్ధన్, పావని, భరత్, రవి, ఆర్‌ఏలు శేక్షావలి, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



మేనేజర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ సిబ్బంది

# శ్రీకాళికాంబా చంద్రశేఖరస్వామి ఆలయంలో అన్నదాన వితరణ

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శ్రీకాళి కాంబ చంద్రశేఖరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీకాళీమాత సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం మధ్యాహ్నం భక్తులకు అన్న వితరణ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఈకార్య క్రమాన్ని టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈకార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ ఉమ్మడి జిల్లాల చార్టర్ గవర్నర్ శ్యాంసుందర్‌గుప్త, కాళీమాత సేవా సమాజం అధ్యక్షులు ఆరవేటి వాసు, సభ్యులు విజయ్, రమేశ్, తిమ్మయ్య, హరి, రామచంద్రయ్య, టీడీపీ నాయకులు కిరణ్, ఉప్పరి సురేష్, నాగరాజులు పాల్గొన్నారు.



అన్నదాన వితరణను ప్రారంభిస్తున్న దృశ్యం

# చిన్నారులు క్రమశిక్షణతో మెలగాలంటే క్రీడల్లో పాల్గొనాలి- డాక్టర్ శంకర్ శర్మ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** చిన్నారులు, విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలంటే క్రీడల్లో పాల్గొనాలని డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ వద్దనున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మండపంలో శుక్రవారం తైక్వాండో వేసవి శిక్షణ తరగతులను డాక్టర్ శంకర్ శర్మ ప్రారంభించారు. తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యలలో చిన్నారులకు తైక్వాండోలో శిక్షణ ఇస్తున్నారు. ఈ వేసవి శిక్షణ తరగతులు నెలరోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయాన్నే మార్షల్ ఆర్ట్స్ ప్రాక్టీస్ చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలపై శ్రద్ధ పెట్టి చిన్నతనం నుంచే క్రీడల్లో పాల్గొనేటట్లు ప్రోత్సహించాలని కోరారు. క్రీడల్లో పాల్గొంటే జీవితంలో క్రమశిక్షణ అలవాటవుతుందన్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో యోగా, వ్యాయామం ఉండడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఆరోగ్యంగా ఉన్న వారే దేశ భద్రతకు ఉపయోగపడతారన్నారు. ఉదయం విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నందున వారికి ఉపయోగకరంగా ఉంటుందని హాట్ బాక్స్‌లను క్రీడాకారులందరికి డాక్టర్ శంకర్ శర్మ అందచేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

# బాలికలు తెలుసుకునేలా చేయడమే కిశోర వికాస కార్యక్రమం ఉద్దేశ్యం

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** జూపాడుబంగ్లా మండల పరిధిలోని తంగడంచ గ్రామంలోని కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమం మొదటి రోజు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిర్మలమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం-3ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నిర్మలమ్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం మొదటి సెషన్‌లో భాగంగా కిశోర బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, వారి లక్ష్యాలను తెలుసుకొని వాటిని నిర్ధారించుకోవడంపై వారికి అవగాహన కల్పించడమని ఆమె తెలిపారు. అలాగే ఒకరికొక్కరు తెలుసుకోవడంతోపాటు ఆటల పాటల ద్వారా వారిని ప్రేరేపించడం ఎలాగో అలాగే వారు తప్పని సరిగ్గా కిశోర బాలికలు పాటించాల్సిన నియమాలను తెలుసుకొని వాటిని పాటించాలని వారికి తెలియజేయడం జరిగిందన్నారు. అందరూ కలసి కట్టుగా ఉంటూ వారికి సంబంధించిన నియమాలను గౌరవించి పాటించేలా వారిని ప్రోత్సహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు వైవి రమణకుమారి, జయంతి, పుష్పావతి, ఆశా కార్యకర్తలు శ్యామలమ్మ, రాములమ్మ, కిశోరి బాలికలు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ తీగెలు తగిలి మూడు ఆవులు మృతి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని పుట్టుపల్లి గ్రామానికి చెందిన రైతుల మూడు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై చనిపోయినట్లు రైతులు తెలిపారు. శుక్రవారం సాయంకాలం కృష్ణనంది దారిలోని బెల్లం నాగిరెడ్డి పొలం వద్ద ఎల్‌టీ లైన్ గాలీ, వానకు తెగిపోవడంతో మూడు ఆవులు అక్కడ మేత మేస్తుండగా షాక్‌కు గురై చనిపోయాయని రైతులు వాపోయారు. పుట్టుపల్లికు చెందిన ఉమ్మడి భాస్కర్‌రెడ్డి, భూపతి కన్నయ్య, ఇటికెల రాజన్నలకు చెందిన ఆవులని, వాటి విలువ ఒక్కోక్కటి సుమారు రూ.60 వేల వరకు ఉండవచ్చునని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు పేర్కొన్నారు.



సూర్య www.suryaa.com



# విశ్వంలోని రహస్యాలను శోధించడమే సైన్స్ పని

## – జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** సైన్స్ అన్నది ప్రయోగానికి లోబడే పనిచేస్తుందని, ప్రయోగం అన్నది నీవున్న చోట ప్రస్తుత కాలంలో జరుగుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాల్ నందు రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేదిక ప్రజల సమస్యలైన అక్షరాస్యత, సారా ఉద్యమం మరియు పొదుపు, మహిళా సాధికారత అంశాలపై పని చేస్తుందని రాబోయే కాలంలో యువత అలవాట్లు, విద్య, ఆరోగ్యం, సైబర్ నేరాలు వంటి రంగాల్లో పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర మహాసభలు జూలై నెలలో కడప లేదా ఒంగోల్‌లో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచడానికి సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, కోశాధికారి సనావుల, వేదిక వ్యవస్థాపక డాక్టర్ బ్రహ్మారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, శేషాద్రి రెడ్డి, రమణయ్య, రమేష్ రాజు, మీన, బాషా, సుజాత, కొండమ్మ, యోహాన్, శ్రీరాములు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సీమపై తమ వైఖరిని స్పష్టం చేయాలి

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** నేడు దేశ ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమరావతి పునర్నిర్మాణం కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమపై తమ వైఖరిని స్పష్టం చేయాలని కర్నూలు డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ మోహన్ కడింపల్లి, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాయలసీమ డిమాండ్స్ తెలుపుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి, టిడిపి ప్రభుత్వాలు గతంలో రాయలసీమకు ఇచ్చిన రాయలసీమ డిక్లరేషన్, మిషన్ రాయలసీమ సంగతి ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. శ్రీభాగ్ ఒప్పందం అమలు ప్రకారం సీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని, సీమకు పన్ను మినహాయింపును ఇవ్వాలని తక్షణమే ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాయలసీమ




మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్

ఉద్యమకారులు సత్యనారాయణ గుప్తా, రైతు స్వరాజ్య వేదిక సభ్యులు శేఖర్ పోతుల, ఆర్‌విపిఎస్ జిల్లా అధ్యక్షుడు పాలకొమ్మ అశోక్ తదితరులున్నారు.

# ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి


## మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ రహమాన్



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి,తహసీల్దారు

బండి ఆత్మకూరు రూరల్,మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా తీసుకున్న 3 లక్షల గృహప్రవేశాల లక్ష్యాలను చేరుకోవడానికి చర్యలు తీసు కోవాలని మండల ప్రత్యేక అధికారి అబ్దుల్ రహమాన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసిల్దార్ పద్మావతి, ఎంపీడీవో దస్తగిరి ,హౌసింగ్ ఏ ఈ సహదేవుడు తో కలిసి హౌసింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు జూన్ నాటికి మండలానికి ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేయాలని సూచించారు. బండి ఆత్మకూరు మండలానికి జూన్ నాటికి 256 గృహాలను పూర్తి చేయాలని ఇప్పటికి 107 గృహాలు పూర్తయ్యాయని మిగిలిన వివిధ దశలలో పెండింగ్ ఉన్న గృహాలను లబ్దిదారులతో మాట్లాడి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ ఏఈ సహా దేవుడు మాట్లాడుతూ బండి ఆత్మకూరు మండలానికి లేఔట్ లో కింద 519 గృహాలు మంజూరయ్యాయని, వివిధ కారణాలతో 320 రద్దయినట్లు తెలిపారు. 50 గృహాలు పూర్తయ్యాయని 150 గృహాలు వివిధ దశలలో పెండింగ్ లో ఉన్నట్లు తెలిపారు.1163 మంది సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయని 1043 గృహాలు పూర్తయినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద బి ఎల్ సి కుడా ద్వారా అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని బండి ఆత్మకూరు తహసిల్దార్ పద్మావతి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. గ్రామాలలో సర్వే ప్రక్రియను పక్కాగా చేపట్టాలని ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు అనుసరించి లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహులు,హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు చెన్నయ్య ,హరి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# మహానంది క్షేత్రంలో శంకర జయంతి వేడుకలు





మహానంది క్షేత్రంలో శంకర జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యాలు

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో జగద్గురువు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యుల 1237వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మల వేదమంత్రాలతో ఆలయ ప్రధానార్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ స్వామివార్ల చిత్రపటానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి నామసంకీర్తనలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, ఉప ప్రధానార్చకులు ములస్థానం శివశంకర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి



ధర్నా చేస్తున్న సిహెచ్‌ఓలు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** వైద్య ఆరోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం కింద సిహెచ్‌ఓలుగా పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిహెచ్‌ఓలు అన్నారు. ఎన్‌హెచ్‌ఎం కింద సిహెచ్‌ఓలుగా పనిచేస్తున్న గత 2సం॥లుగా జీత భత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని దీనికి సంబంధించి మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శుక్రవారం శాంతియుత నిరసన కార్యక్రమంలో భాగంగా సిహెచ్‌ఓలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేళ్లు దాటిన సిహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ప్రతి నెల శాలరీతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి ఏడాది 5శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆర్థికమైన మరియు ఆర్థికేతర సమస్యలను తీర్చే విధంగా హామీ ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లను తీర్చే వరకు తాము శాంతియుతమైన నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు.

# శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలకు జాతీయస్థాయి అవార్డు



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాలలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యారంగంలో అపూర్వమైన సేవలు అందించినందుకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇండియా ఎలైట్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ ఎక్సలెన్స్ వారిచేత కళాశాలకు ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషనల్ స్టాండర్డ్స్ అడాప్టబిలిటీ అండ్ ఇంప్లిమెంటేషన్ జాతీయ అవార్డు లభించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రగతిరెడ్డి పాల్గొని కళాశాల తరపున బెంగుళూరులో పురస్కారాన్ని స్వీకరించారు. కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ రంగంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు కళాశాలకు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈపురస్కారం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ కృషి, విద్యార్థుల నిబద్ధత ఫలితమే ఇది మా విద్యా ప్రమాణాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ వేసవి కాల సెలవులలో ఉచితంగా గ్రూప్–1, గ్రూప్–2, అన్ని పోటీ పరీక్షలకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. మే ఈనెల 9వ తేదీ నుంచి రెండు నెలల పాటు పూర్తి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని బిర్లాగేట్ నందు ఎన్‌లిటింగ్ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనల పట్ల శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసి అవగాహన కల్పించినట్లు త్రీటౌన్ సిఐ పి శేషయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవ్వరు కూడా సైబర నేరాగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన అన్నారు. 3వ పట్టణ ఎస్ఐ ఆశాలత, కళాశాల కరస్పాండెంట్ నజీర్, ప్రిన్సిపల్ దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ శేషయ్య

# శిథిలావస్థకు చేరుకున్న పిల్లకాల్వలు

- అక్రమణలకు గురవుతున్న పిల్లకాల్వ భూములు
- సాగునీరందక బీడు భూములుగా మారుతున్న అయకట్టు భూములు
- ముళ్ళకంప చెట్లతో నిండిపోయిన పంటకాల్వలు
- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ అధికారులు



## బస్టాండు ఆవరణంలో పేరుకుపోయిన చెత్తా చెదారం

– పట్టించుకోని అధికారులు

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ ఆర్టీసి బస్టాండు ఆవరణంలో చెత్తా చెదారం పేరుకుపోయి ఈగలకు, దోమలకు ఆవాస నిలయాలుగా మారాయి. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి ఊర్లకు వెళ్లడానికి వచ్చిపోయే ప్రయాణీకులతో నిత్యం ఆర్టీసి బస్టాండు ఎంతో రద్దీగా ఉంటుంది. బస్టాండు ప్రాంగణంలో ప్రయాణీకులు తిను పదార్థాలు తిని పారేసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించే దిక్కు లేక బస్టాండు ఆవరణంలో వెనుక వైపున చెత్త చెదారం ఎక్కువ అయిపోయి డంపింగ్ యార్డును తలపిస్తుంది. చెత్త చెదారంపై వాలిన ఈగలు, దోమలు వలన ప్రయాణీకులు అనేక రోగాలు బారిన పడే అవకాశాలు ఉన్నాయని ప్రయాణీకులు వాపోతున్నారు. డంపింగ్ యార్డును తలపిస్తున్న చెత్తను తొలగించే దిక్కులేరని ప్రజలు వాపోతున్నారు. ఇటు ఆర్టీసి అధికారులు కానీ, ఇటు గ్రామ పంచాయతీ అధికారులుగాని, బస్టాండు వైపు కన్నెత్తి కూడ చూడడం లేదన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తా చెదారాన్ని తొలగించి బస్టాండు ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రయాణీకులు, ప్రజలు కోరుతున్నారు.






**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** తుంగభద్ర దిగువ కాలువలోని పెద్దకడుబూరు మండల పరిధిలోని సూగూరు మేజర్ కాలువతో పాటు దాని కింద ఉన్న వివిధ డిస్ట్రిబ్యూటర్ కింద ఉన్న పిల్లకాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ కాల్వకింద వేలాది ఎకరాలు ఆయకట్టు భూములను రైతులు సాగుచేస్తున్నారు.అయితే కాల్వల ప్రక్కనే ఉన్న కొంత మంది రైతులు కాల్వలను అక్రమణలకు చేస్తున్న మండల నీటి పారుదల శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా కాలువలో పూడిక. పాచిపేరుకొని పోవడం కాలువ గట్లు వెంబడి దట్టమైన ముళ్ళ కంపతో నిండిపోవుడంతో సాగునీరు పారుదల కష్టతరమౌతుందని , అంతేకాకుండా నీటి కాల్వల పై అధికారులు పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అదే విధంగా సాగునీరు పారుదల సక్రమంగా లేకపోవడంతో, కాల్వలో పూడిక పేరుకొని పోయి కాల్వగట్లను ఎక్కడ పడితే అక్కడ గండికొట్టి అక్రమంగా సాగునీరు తరలించడంతో వేలాది ఎకరాల ఆయకట్టు భూములు బీడు భూములుగా మారాయని అయిన ఇరిగేషన్ శాఖ అధికారులు మాత్రం స్పందిం చడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి వెంటనే సూగూరు మేజర్ కాలువలపై ముళ్ళ కంపను తొలగించాలని,కాల్వలకు మర్మత్తులు వెంటనే చేపట్టాలని పలువురు అయకట్టు రైతులు కోరుతున్నారు.

## ఏజెన్సీ ఉద్యోగులకు జీతాలు కరువు



**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఏజెన్సీ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు కరువయ్యాయని ఉద్యోగులు వాపోతున్నారు. మహానంది దేవస్థానంలో దాదాపు 90 మంది ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగుల కంటే రెండింతలు ఎక్కువగా మహానంది దేవస్థానంలో ఏజెన్సీ ఉద్యోగులే ఉన్నారు. వారికి కేవలం రూ.12 వేల జీతం మాత్రమే వస్తుంది. వాటితోనే కుటుంబ పోషణ చేసుకుంటున్న చిరు ఉద్యోగులు గత రెండు నెలలుగా జీతాలు లేక ఆకలి కేకలు పెడుతున్నారు. అప్పులు చేస్తే వడ్డీలు కట్టలేమన్న బాధతో దేవస్థానం వారు ఇచ్చే వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. దీనిపై ఆలయ ఏఈవో మధును వివరణ కోరగా కమీషనర్ కార్యాలయం నుంచి అనుమతులు రా వాల్సి ఉందని తెలిపారు. నివేదికలు తయారు చేసి కమీషనర్ కార్యాలయానికి పంపామని, ఏజెన్సీ కాంట్రాక్టర్ అనుమతులు తెచ్చుకోవాల్సి ఉందని అన్నారు. మొత్తానికి ఎవరి నిర్లక్ష్యమో తెలియదు కానీ ఏజెన్సీ ఉద్యోగులకు మాత్రం వేతనాలు లేక వారు తీవ్ర అవస్థలు ఎదు ర్కొంటున్నామని వాపోతున్నారు. అధికారులో, ఏజెన్సీ కాంట్రాక్టరో, ప్రజాప్రతినిధులో, శాసన సభ్యులో స్పందించి తమ ఆకలి బాధలు తీర్చాలంటూ ఏజెన్సీ ఉద్యోగులు ఎకరువు పెడుతున్నారు.

## ప్రభకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామం లో శ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి తిరునాల మహోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామి వారి ప్రభ ఊరేగింపు ఉత్సవాల్లో ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించు కున్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగేశ్వర రెడ్డి, కృష్ణయ్య చౌదరి, రమణరెడ్డి, మాదన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రభలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత

## ఆర్డీటీ సేవలను పునరుద్ధరించండి



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఆర్డీటీ చేస్తున్నటువంటి పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు కేంద్రం చర్యల కారణంగా నిలిచిపోయాయని, వీటిని వెంటనే కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడానికి కృషి చేయాలని సన్నాల సాయిరామ్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కూటమి ప్రభుత్వం భాగస్వామ్యం ఉన్నందున ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలని అన్నారు. ఆర్డీటీకి వచ్చే ఫండ్స్‌కు ఏలాంటి అంతరాయం లేకుండా సేవకు వచ్చే ఫండ్స్ ద్వారా సేవలను పునరుద్ధరించాలని అన్నారు. గత 50 ఏళ్లుగా అనంతపురం జిల్లాలో, అదే విధంగా ఏపీ, తెలంగాణాల్లో కులమతాలకు అతీతంగా, గ్రామాల్లో నిశ్వార్థంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, విద్య, వైద్యం, స్వయం ఉపాధి, క్రీడలు, ఇలా అన్ని రంగాలలో సేవా కార్యక్రమాలు ఆర్డీటీ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తుందని అన్నారు. నంద్యాలలో మహిళా కళాశాల, పలు కాలనీల్లో గృహాల నిర్మాణానికి ఆర్డీటీ చేయూతనందించిందని అన్నారు. త్వరితగతిన పునర్మించడానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఈనెల 4న గంగా వార్షిక పుష్కరోత్సవం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో వెలసిన రుద్రగుండం పుష్కరిణిలో ఈనెల 4వ తేదీన గంగా వార్షిక పుష్కరోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధానిలు తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ వైషఖ శుద్ధ సప్తమి రోజున గంగాదేవి స్వయంభువుగా మహానంది క్షేత్రంలోని నంది తీర్థంలో (రుద్రగుండం) సంకల్ప స్నానం ఆచరించి శుద్ధిని పొందుతుందని పురాణాలలో తెలుపబడిందని అన్నారు. ఇంతటి పవిత్రమైన రోజున గంగా దేవి పూజల అనంతరం స్నానం ఆచరించిన భక్తులు పునీతులవుతారని ఆయన తెలిపారు.

## జూనియర్ సివిల్ జడ్జిగా జోష్న బాధ్యతలు




**పత్తికొండ, మేజర్ న్యూస్ :** పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జిగా శుక్రవారం జోష్నాకు బాధ్యతలు చేపట్టారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబు సివిల్ జడ్జిని బార్ అసొసియేషన్‌కు ఆహ్వానించి పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జితో న్యాయవాదులు పరిచయ వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. న్యాయవాదులు వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్, కోశాధికారి సూరజ్,నబీ, లైబ్రేరి సెక్రటరీ నర్సారావు, సీనియర్ న్యాయవాదులు ఏల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మన్న, సత్యనారాయణ, పంపాపతి, మై రాముడు, నాగభూషణరెడ్డి, హులైన్న, కృష్ణయ్య, మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్, బాబు, నరసింహాయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రంగస్వామి, హరికృష్ణ, బి.మధు, కభీర్దాస్, నెట్టేగళ్లు, చంద్రశేఖర్, వీరస్వామి, పాల్గొన్నారు.

## ఆటో ఢీ కొని వ్యక్తి మృతి



**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని రేగడగూడూరు, మద్దూరు గ్రామ రహదారిలో ఆటో బైక్‌ను ఢీ కొన్న ప్రమాదంలో ఉపేంద్ర గౌడ్ (28) యువకుడు మృతి చెందాడు. మృతుడు తూడిచెర్ల గ్రామంలో పెళ్లి చేసుకున్నాడు. భార్య వద్దకు వెళ్తున్న క్రమంలో బైక్‌ను ఆటో ఢీకొనడంతో మృతి చెందాడు. వెలుగోడు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# DSC/TET ENGLISH PRACTICE QUESTIONS

**1. Choose the sentence that denotes future.**
1. I am going to write exams.
2. She is going to college.
3. We are learning English to get a job.
4. He is doing homework.

Ans. : 1
Explanation : "Be + Going + to + base form" – indicates future time.

**2. Choose the sentence that does not indicate a complete action.**
1. She drank coffee a few minutes ago.
2. He passed SSC in 2010
3. It's time they left for Hyderabad.
4. It rained heavily yesterday.

Ans. : 3
Explanation : "It's time + V2" is used to say that something is not happening. But to express that something should be done, add that is already a little late.


**3. Choose the sentence that shows "resultative past".**
1. They had played games
2. It has rained heavily.
3. We bought a car last month.
4. She drew some pictures.

Ans. : 2
Explanation : The present perfect is also used to refer to past actions whose results are seen in the present. Hence, it is also called the evidential use of the present perfect.
Resultative past = Present Perfect Tense.

**4. She .................................. (write) exams this week.**
1. is writing 2. had writing
3. wrote 4. has written

Ans. : 4
Explanation : in the given sentence, "this week" indicates an unfinished time expression. Unfinished time expressions denote the present perfect tense. i.e., (has/have + v3)

**5. Choose the Tense that doesn't denote future time.**
1. Simple Present Tense.




2. Present Continuous Tense.
3. Simple Future Tense.
4. Present Perfect Continuous Tense.

Ans. : 4
Explanation : "Simple Present Tense", "Present Continuous Tense", "Simple Future Tense" denote the future. But the present perfect continuous tense doesn't indicate the future time.

**6. After I .................................. (drink) coffee, I played games.**
1. drank 2. am drinking
3. had drunk 4. drink

Ans. : 3
Explanation : When two actions are clearly separated by time, the first action must be in "past perfect tense" i.e., "had +V3"

**7. He will call you before he .......................... (leave) Chennai.**
1. leaves 2. left
3. has left 4. will leave.

answer : 1
Explanation : When the main clause's verb is in simple future tense, use simple present tense in subordinate clause.

**8. My brother .................................. (be) ill since last week.**
1. was 2. had been
3. has been being 4. has been

Ans. : 4
Explanation : We generally use the present perfect tense with the key word since/for. But the verb 'be' is not used in continuous tense. instead of the continuous tense, we have to use "past participle " i.e. 'been'.

**9. Krithi ...................... (sleep) at 4 O' Clock yesterday.**
1. is sleeping 2. slept
3. was sleeping 4. had slept

Ans. : 3
Explanation : past continuous tense is used with a specific point of time in the past.

**10. My mother .................................. (reach) Delhi by 9 p.m.**
1. will reach 2. will reaches
3. will be reached 4. will have reached.

Ans. : 4
Explanation : The future perfect tense denotes imaginary completion of an action by a certain future time.



**Karthik Nitturu**
English Faculty
Anantapur

# ఎకానమి

## APPSC, TGPSC
## గ్రూప్-1, 2, JL, DL

**1. 1990-92 సంవత్సరాల మధ్య వార్షిక ప్రణాళికలు అమలు చేయడానికి ప్రధాన కారణం**
ఎ. ఆర్థిక సంక్షోభం బి. రాజకీయ అస్థిరత
సి. విదేశీ చెల్లింపుల సంక్షోభం డి. పైవన్నీ
**జవాబు : డి**

**2. 8వ మరియు 9వ పంచవర్ష ప్రణాళిక రెండింటిలో పరిష్కరించబడిన ముఖ్యమైన సమస్యను గుర్తించుము**
ఎ.అధిక మొత్తంలో ఉపాధి అవకాశాలను కల్పించడం
బి.పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం
సి.వస్తు సేవలకు స్థిరమైన ధరలు కల్పించడం
డి.జనాభా పెరుగుదలను నియంత్రించడం
**జవాబు : డి**

**3. ఎనిమిదవ ప్రణాళిక ప్రధాన లక్ష్యం**
ఎ. సామాజిక న్యాయం, సత్వర వృద్ధి
బి.పేదరిక నిర్మూలన మరియు నిరుద్యోగం తొలగింపు
సి. శీఘ్ర పారిశ్రామికీకరణ డి. వ్యవసాయ వృద్ధి
**జవాబు : బి**

**4. 8వ ప్రణాళిక గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఏ విధమైన ప్రభావం చూపినది?**
ఎ. మిగులు ఉత్పత్తుల ఎగుమతి బి. ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి
సి. గ్రామీణ ప్రజల తలసరి ఆదాయాలు పెరగడం
డి. వ్యవసాయ ఆధునికీకరణ అమలు
**జవాబు : ఎ**

**5. 8వ ప్రణాళికలో పరిష్కరించబడని సమస్యను కిందివానిలో గుర్తించుము.**
ఎ. ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి లేకపోవడం బి. నిరక్షరాస్యత
సి. నిరుద్యోగ సమస్యను నివారించలేకపోవడం
డి. విదేశీ వ్యాపారాలు లేకపోవడం
**జవాబు : డి**

**6. ఈ క్రింది వాటిలో 8వ ప్రణాళిక లక్ష్యం కాని అంశాన్ని గుర్తించండి.**
ఎ. పరిశ్రమల ఆధునికీకరణ
బి. మానవ వనరుల అభివృద్ధి
సి. విద్య, ఆరోగ్య సంరక్షణ
డి. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి
**జవాబు : డి**

**7. మహిళా సమృద్ధి యోజన, మధ్యాహ్న భోజన పథకం, గంగా కళ్యాణ్ యోజన పథకం ఏ ప్రణాళికలో ప్రవేశపెట్టబడినాయి?**
ఎ. 6వ ప్రణాళిక బి. 7వ ప్రణాళిక
సి. 8వ ప్రణాళిక డి. 11వ ప్రణాళిక
**జవాబు : సి.**

**8. మధ్యాహ్న భోజన పథకం, ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన వంటి కార్యక్రమాలను ఏ ప్రణాళికలో ప్రారంభించారు?**
ఎ. 10వ ప్రణాళిక బి. 12వ ప్రణాళిక
సి. 5వ ప్రణాళిక డి. 8వ ప్రణాళిక
**జవాబు : డి**

**9. 8వ ప్రణాళిక యొక్క లక్ష్య వృద్ధి రేటు, నమోదైన వృద్ధి రేటును గుర్తించుము**
ఎ. 7.7%, 6.6% బి. 5.6%, 6.8%
సి. 5.4%, 6.3% డి. 7%, 9.1%
**జవాబు : బి**

**10. 8వ ప్రణాళిక వ్యయం కింది వానిలో**
ఎ. 7,98,100 కోట్లు బి. 7,97,110 కోట్లు
సి. 7,96,100 కోట్లు డి. 7,95,100 కోట్లు
**జవాబు : ఎ**

**11. ప్రభుత్వ వ్యయం కంటే ప్రయివేటు వ్యయం అధికంగా ఉన్న ప్రణాళిక ఈ కింది వానిలో**
ఎ. 6వ ప్రణాళిక బి. 8వ ప్రణాళిక
సి. 10వ ప్రణాళిక డి. 12వ ప్రణాళిక
**జవాబు : బి**

**12. 8వ ప్రణాళికా కాలంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కింది వానిలో**
ఎ. ప్రణబ్ ముఖర్జీ బి. మధు దండావతే
సి. కె.సి. పంత్
డి. మాంటెంక్ సింగ్ అహ్లూ వాలియా
**జవాబు : ఎ**

**13. 9వ ప్రణాళిక యొక్క లక్ష్య వృద్ధి రేటు, సాధించిన వృద్ధిరేటును గుర్తించుము**
ఎ. 6.5% & 5.4% బి. 6.5% & 5.5%
సి. 6.5% & 5.6% డి. 6.5% & 5.1%
**జవాబు : ఎ**

**14. సాంఘికన్యాయం, సమానత్వంతో కూడిన ఆర్థికవృద్ధి ఏ ప్రణాళిక లక్ష్యం?**
ఎ. 10వ ప్రణాళిక బి. 11వ ప్రణాళిక
సి. 12వ ప్రణాళిక డి. 9వ ప్రణాళిక
**జవాబు : డి**

**15. 9వ పంచవర్ష ప్రణాళిక అమలు సమయంలో భారత ప్రధాని ఎవరు?**
ఎ. అటల్ బిహారీ వాజ్‌పేయి బి. చరణ్ సింగ్
సి. మన్మోహన్ సింగ్ డి. చంద్రశేఖర్
**జవాబు : ఎ**

**16. రైతులకు ఋణ సౌకర్యం కల్పించడం కోసం ఏర్పాటైన కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి) సిస్టమ్ ఏ సంవత్సరంలో ప్రారంభించారు?**
ఎ. 1995 సం. బి. 1999 సం.
సి. 1998 సం. డి. 1999-2000 సం.
**జవాబు : సి**

**17. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకోసం ఏర్పాటైన సర్వశిక్షా అభియాన్ ఏ ప్రణాళికలో అమలు చేసారు?**
ఎ. 8వ ప్రణాళిక బి. 9వ ప్రణాళిక
సి. వార్షిక ప్రణాళిక కాలంలో
డి. 12వ ప్రణాలిక
**జవాబు : బి**



ఎం.అన్నారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ
హనుమకొండ.

## మట్టి నమూనా సేకరణ పై అవగాహన కార్యక్రమం



**పాములపాడు మేజర్ న్యూస్ :** పాములపాడు కంబాలపల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి పని ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి నమూనా సేకరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డి ఆర్ సి ఏ ఓ హేమలత హాజరయ్యారు ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా నేలలోని కార్బన ం ఉదజని సూచిక ప్రధాన పోషకాలు పొటాష్ ఎంత మోతాదులో ఉందో తెలుసుకోవచ్చని పూసల పరీక్షల ద్వారా జింక్ ఇనుము బోరన్ కాపర్ మ్యాగ్నెస్ మాగ్నీషియం అందు మోతాదులో ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి..ఎమ్మెల్యే అఖిలప్రియ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ అనంత డిగ్రీ కళాశాలలో ఈనెల 5న నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పిలుపునిచ్చారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ లు ప్రత్యేక చొరవ తీసుకొని నిరుద్యోగ సమస్య నిర్మూలనకు జాబ్ మేళాలను తరచుగా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. స్థానిక అనం త డిగ్రీ కళాశాలలో 5న నిర్వహించనున్న మేగాజాబ్మేళాకు సంబంధించిన కరప త్రాలనుశుక్రవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరనితెలియజేశారని కళాశాల కరెస్పాండంట్ అనంత రామసుబ్బారెడ్డి తెలియజే శారు. ఈ జాబ్ మేళాలో 15 ప్రైవేటు కంపెనీలు ప్రతినిధులు పాల్గొంటారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనుటకు పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బి.టెక్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఇంటర్వ్యూకు పాల్గొనే అభ్యర్థులు రెజ్యూమ్, ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, విద్యా అర్హత పత్రాలు తీసుకోని రావాలని తెలిపారు. దీనికి సంబంధించిన ఇతర వివరముల కొరకు 8790895790, 8498070087 నెంబర్లకు సంప్రదించాలని తెలియజేశారు.

## వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఇంఛార్జ్ కార్యదర్శిగా యు. గురుస్వామి



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి మేజర్ గ్రామపం చాయతీ ఇంచార్జ్ కార్యదర్శిగా యు. గురుస్వామి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న కె. లోకనాథ్ ప్రమోషన్ పై నంద్యాల జిల్లా, డోన్ మండలం, దొరపల్లి గ్రామా పంచాయితీకి బదిలీపై వెల్లినట్లు ఎంపీడీవో సుహాసినమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కార్యదర్శి యు. గురుస్వామి మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యలను గ్రామ ప్రజలు తమ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. పంచాయతీ ఇంచార్జ్ అధికారికి పట్టణంలోని 14, 15 వార్డులలో పది రోజులకు ఒకసారి త్రాగునీరు రావడం జరుగుతుందని నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆవార్డు ప్రజలు కోరుతున్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చెల్లె విధంగాచర్యలు తీసుకోవాలని కోరారు. వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శిగా యు.గురు స్వామి పదవి బాధ్యతలు చేపట్టారు.

## మహానంది క్షేత్రంలో ఆ మూడు రోజులు నిరంతర దర్శనం

**మహానంది, మేజర్న్యూస్ :** వేసవి కాలం సెలవుల దృష్ట్యా మహానంది పుణ్యక్షేత్రంలో ఆ మూడు రోజులు నిరంతర దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అధికారులు తెలిపిన వివరాల మేరకు నేటి నుంచి మొదలు జూన్ 15వ తేదీ వరకు శనివారం, ఆదివారం, సోమవారాలు నిరంతర దర్శనాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఆ మూడు రోజు లు నిరంతర దర్శనం కల్పిస్తున్నామని, భక్తుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## లింగ్విస్టిక్ కన్నడ పట్టా అందుకున్న రచయిత రామకృష్ణారెడ్డి



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన యువ రచయిత రామకృష్ణారెడ్డి మైసూరులోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సి ఐ ఐ ఎల్) నుండి లింగ్విస్టిక్ కన్నడ పట్టానుఅందుకున్నారు. ఈ సందర్భంగా రచయిత రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ తెలుగు లిట్ చేసిన తాను స్వతహాగా రచయిత అవ్వడం వల్ల ఇతర భాషల అధ్యయనం చేయడం వల్ల భాషా పరిజ్ఞానం పెరుగుతుందనిపేర్కొన్నారు. కన్నడ భాషాధ్యయనం చేసినందుకు సెంట్రల్ గవర్నమెంట్ నుండి 80 వేల రూపాయల స్టైఫండ్ పొందినట్లు తెలిపారు. తమిళనాట ఇప్పుడు హిందీ భాష పట్ల అధికార నాయకుల ప్రవర్తన చూస్తుంటే బాధేస్తోందని, తాను ఇప్పుడు తమిళం కూడా నేర్చుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కువ భాషలు నేర్చుకుంటే వివిధ రాష్ట్రాల మాండలికాలు, సంస్కృతి ఆచార వ్యవహారాలతో పాటు మాతృభాష మీద పట్టురావడమే కాకుండా, భాష మీద మరింత మమకారం ఏర్పడుతుందని ఆయన అన్నారు. భాషాధ్యయనం కొరకు ప్రభుత్వమే ప్రత్యేక నిధులను కేటాయించాలని, ఎవరు ఎన్ని భాషలు నేర్చుకున్నా వారి మాతృభాషలో సంభాషణ జరిపితే మానసిక పరిపక్వత వికసిస్తుందని ఆయన అన్నారు. కన్నడ భాషలో పట్టా పొందిన రామకృష్ణారెడ్డిని వివిధ సాహితీ సంఘాల ప్రతినిధులు అన్నెం శ్రీనివాస్ రెడ్డి , డాక్టర్. గెలివి సహదేవుడు, డాక్టర్ కె. రవీంద్ర నాథ్ ప్రత్యేకంగా అభినందించారు.

## జ్వాలాపురం గ్రామంలో ఉన్నతాధికారుల పర్యటన

**బనగానపల్లెరూరల్,న్యూస్:** బనగానపల్లె మండల పరిధిలోని జోలాపురం గ్రామంలో శుక్రవారంనాడు ఉన్నతాధికారులు పర్యటించారు. గత కొన్నిరోజులుగా మీడియాలో జ్వాలాపురం అతిపెద్ద ప్రాచీన చరిత్ర కలిగిన ప్రాంతం అని ఈ నేలలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఈ మైనింగ్ కార్యకలాపాల వల్ల అతి అరుదైన ప్రాక్ చరిత్ర కాలంనాటి ఆదిమా ఆవాసాలు మరియు సైట్‌లు దెబ్బతింటున్నాయని మైనింగ్ కార్యకలాపాలను నిరోధించాలని కోరుతూ పలువురు కోరగా దీనిపై స్పందించిన రాష్ట్ర విద్యాశాఖ మరియు ఐటిశాఖ మంత్రులు నారా లోకేష్ స్థానిక అధికారులను వెంటనే జ్వాలాపురంలోని ప్రాచీన సైట్లను సందర్శించి తగు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం నాడు నంద్యాల డివిజనల్ ఆఫీసర్ నరసింహులు పురావస్తుశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రజిత, జిల్లా పర్యాటకశాఖ అధికారి సత్యనారాయణ, డివిజనల్ లెవెల్ డెవెలప్‌మెంట్ ఆఫీసర్ శివారెడ్డి, పంచాయితీరాజ్ నారాయణ రెడ్డి, ఎంపిడిఓ వెంకటరమణ, తహశీల్దార్ నారాయణ రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్ పద్మ, పంచాయితీ సెక్రెటరీ శకుంతలకు కూడిన బృందం జ్వాలాపురం నందు అతి పురాతన చరిత్ర కాలం నాటికి చెందిన బూడిద సైట్లలో సంయుక్త తనిఖీని నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీలో జ్వాలాపురం గ్రామం నందు క్రీస్తు పూర్వం 74000 సంవత్సరాల క్రితం ఇండోనేషియా దేశంలోని కుమ్రతా దీవిలో గల తోబా అగ్ని పర్వతం మహా విస్ఫోటనం చెందడం వల్ల వెలిసిన బూడిద ప్రపంచ వ్యాప్తంగా పడినట్లు అందులో ముఖ్యంగా జ్వాలాపురం గ్రామ పరిసరాల్లోని భూమి పొరలను ఆ బూడిద నిక్షిప్తమైనట్లుగా ఆర్కేయాలజిస్టు గుర్తించారు. 2003 నుండి 2009వ సంవత్సరం వరకు వివిధ ఖండాల దేశాలకు చెందిన ఆర్కేయాలజిస్టు ప్రొఫెసర్ రవికోరిసెట్టార్, మార్గ నిర్దేశంలో తవ్వకాలు జరిపి ఆదిమానవుని యొక్క వలస జీవనం మరియు ఉనికిని గుర్తించి కాలానుగుణంగా మార్పుల కారణంగా తవ్వకాలు జరిపిన సైట్లలో మట్టికప్పివేయబడగా వ్యవసాయ పంటలు పండిస్తున్నట్లు పరిశీలనలో తేలింది. ఇక్కడ జరుగుతున్న పనులను నిరోధించడానికి రెవెన్యూశాఖ, భూగర్భగనుల శాఖా, పురావస్తుశాఖ ఉమ్మడిగా చేయవలసిన అవసరం ఉందని భావించడమైనది. బృందం సభ్యులు గ్రామస్థులతో మాట్లాడి ఎవ్వరూ కూడా ప్రాక్ చరిత్ర ఆనవాళ్లు గల భూ పొరలలో మట్టి నేలను ధ్వంసం చేయకూడదని వాటిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పురావస్తుశాఖ సహాయ సంచాకులు డాక్టర్ వి. రజిత తెలిపారు.

## అమరావతి పునర్నిర్మాణంతో షరీఫ్ కల నెరవేరిన రోజు

◆ **మైనార్టీ సెల్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డా ఫక్రుద్దీన్**

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** 'రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయు డు నేతృత్వంలో శుక్రవారం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతి పునర్నిర్మాణంతో ఏపీశాసనమండలి మాజీ చైర్మన్ఎం. షరీఫ్ కల నెరవేరినట్లయ్యింది' అని మైనారిటీ సెల్ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గుంతకల్ మైనారిటీ అబ్జర్వర్ గడ్డా ఫక్రుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. షరీఫ్ నీతి నిజాయితీ నిబద్ధతను గ్రహించే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనను శాసనమండలి చైర్మన్ గా నియమించారని తెలిపారు. అప్పట్లో అమరావతి బిల్లును శాసనమండలిలో ప్రవేశపెట్టినప్పుడు వైసీపీ నాయకులు ఎన్ని ఒత్తిళ్లకు గురి చేసినా.. షరీఫ్ సెలెక్ట్ కమిటీకి పంపిన సంగతిని ఆయన గుర్తు చేశారు. గత వైసిపి పాలనలో వైసిపి నాయకులు చేసిన బెదిరింపులకు ఏమాత్రం బెదరకుండా అటు పార్టీ సిద్ధాంతాలకు, ఇటు రాజధాని రైతుల ఆవేదనలకు అనుగుణంగా వ్యవహరించిన ఏకైకవ్యక్తి షరీఫ్ మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో షరీఫ్ కలలుగన్న అమరావతినే రాజధానిగా పునర్నిర్మాణం కానుండటం పట్ల గడ్డా ఫక్రుద్దీన్ ఆనందం వ్యక్తం చేశారు. రాజధానితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని స్పష్టం చేశారు.




## అరుణ భారతి ఆధ్వర్యంలో కవులు, కళాకారులకు పెద్దపీట వేస్తాం – బి.సి రాజారెడ్డి

**– సమాజ నిర్మాణంలో కవులు కళాకారులది కీలక పాత్ర**
**– అలరించిన జితేంద్ర మిమిక్రీ ప్రదర్శన**










**బనగానపల్లెమేజర్,న్యూస్:** సమసమాజ నిర్మాణంలో కవులు, కళాకారుల పాత్ర కీలకంగా ఉంటుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ అరుణ భారతీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు బి.సి రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణంలో బి.సి గుర్రెడ్డి కాలనీలోని ప్రయదర్శిని స్కూల్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం అరుణభారతీ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు జితేంద్ర మిమిక్రీ ప్రదర్శన గిన్నస్ వరల్డ్ రికార్డు హోల్డర్ షేక్ కరిముల్లా నటరాజ నృత్య కళామందిర్ వారిచే కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కర్నూలు టి.జి.వి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ఆంధ్రజ్యోతి ఎడి షన్ ఇంచార్జి చల్లా నవీన్ కుమార్, ప్రముఖ రచయిత ఇనయాతుల్లా, గజల్ గాయకుడు మహమ్మద్ మియా హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.సి రాజారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు రాయలసీమ అంటే కవులు కళాకారులకు పుట్టినిళ్లు లాంటిదన్నారు. ప్రముఖ కవులు యోగి వేమన, అన్నమయ్య, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, పుట్టపర్తి నారాయణ ఆచార్యులు, గడియారం శేషాచలం, అష్టావధాని సి.వి సుబ్బన్న అలాంటి ఎంతో మంది మహానుభావులు జన్మించిన నేల రాయలసీమ అని నేడు కళాకారులు నిరాదరణకు గురవ్వడం బాధా కరమన్నారు. బనగానపల్లె అరుణభారతి ఆధ్వర్యంలో పలు సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తూ కవులు, కళాకారులకు పారితోషికం అందజేయడంతోపాటు వారికి ఘనంగా సత్కరించి తమవంతు చేయూతనివ్వ డం జరుగుతుందన్నారు. ప్రముఖ సీనీనటులు సుమన్, జయప్రకాష్ రెడ్డి, నాగినీడు, శివారెడ్డి, గరికెపాటి నరసింహారావు, గోరెడ్డి వెంకన్న, రామలింగేశ్వరరావు, గాయని మధుప్రియ, కోమలి సిస్టర్స్‌తోపాటు ఎంతో మంది కళాకారులను బనగానపల్లె ప్రజలకు పరిచయం చేసిన ఘనత అరుణబారతికే దక్కుతుందన్నారు. రాష్ట్రప తి అవార్డు గ్రహిత , కలంకారి చిత్రకారుడు టంగుటూరి శివప్రసాద రెడ్డిని , నందవరం గ్రామానికి చెందిన రంగస్థల నటుడు శివనాగిరెడ్డి సేవలను గుర్తించి వారిని ఘనంగాసత్కరించామన్నారు. కరోనా కాలంలో ఎన్నికలు రావడం వల్ల గత కొన్నేళ్లుగా అరుణభారతి కార్యక్రమాలకు ఆటంకం కలిగిందని భవిష్యత్తులో అరుణభారతీ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు చేపట్టి కవులు, కళాకారులకు పెద్దపీట వేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. జితేంద్ర మిమిక్రీ ప్రదర్శన , షేక్ కరిముల్లా బృందం నిర్వహించిన భరత నాట్యం, కూచిపూడి, నాట్య ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను బి.సి రాజారెడ్డి సత్కరించడం జరిగింది. రామశేషయ్య, బలరామయ్య, భరతుడు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందండి



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని బీసీ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతూ ప్రాథమిక టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలు చక్కగా సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలన్నారు. మహిళా సాధికారత కింద ప్రాథమిక టైలరింగ్ శిక్షణపై శిక్షణ ఇచ్చేందుకు బీసీ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ మరియు కాపు మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 500మంది లబ్ధిదారులకు శిక్షణ పూర్తి అయిన తరువాత ప్రతి అభ్యర్థికి ఒక దర్జీ మోడల్ కుట్టుమిషన్ పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 3441 మందికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఈ నేపథ్యంలో 11,105 మంది బీసీలు, 96మంది కమ్మ, 691మంది రెడ్డి, 871 మంది కాపు, 344మంది ఈబీసీలు, 308మంది ఆర్యవైశ్య, 34మంది బ్రాహ్మణ, ఒకరు క్షత్రియ కులాలకు చెందిన వారు టైలరింగ్ శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 25 టైలరింగ్ శిక్షణ సెంటర్లు ప్రారంభయయ్యాయని కలెక్టర్ తెలిపారు. అన్ని కేంద్రాలలో మొత్తం 2827 మంది మహిళలు టైలరింగ్ శిక్షణ తరగతులకు హాజరవుతున్నారన్నారు. ఇందులో 2381మంది బీసీలు, 5మంది కమ్మ, 104మంది రెడ్డి, 150మంది కాపు, 122మంది ఈబీసీలు, 58మంది ఆర్యవైశ్య, 6మ ది బ్రాహ్మణ, ఒకరు క్షత్రియ కులాల వారు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. శిక్షణ పొందిన మహిళలందరూ స్వయం ఉపాధితో జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

**– కార్యకర్తలే పార్టీకి పునాదులు**

**– ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం సైనికుల్లా పనిచేస్తు పార్టీకి పునాదులుగా నిలిచిన ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాలును ప్రారంభించి మండలంలో శ్రీపతిరావుపేట గ్రామంలో ఇటీవల ప్రమాదవ శాత్తు మరణించిన టిడిపి కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం, భద్రత తెలుగుదేశం పార్టీదని అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టిడిపి కార్యకర్త సుమిత్ర మృతి చెందడం బాధాకరమన్నారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ల చొరవతో ఆ కుటుంబానికి రూ. 5లక్షలు ప్రమాద బీమా మంజూరు చేయించామన్నారు. తెలుగుదేశం కార్యకర్తలంతా కుటుంబ సభ్యులని, వారికి ఏ అవసరం ఇచ్చినా, ఏ ఆపద వచ్చినా అన్ని వేళల అందుబాటులో ఉండి అండగా ఉంటామని అన్నారు. పార్టీకి పునాదులాంటి కార్యకర్తల సంక్షేమాభివృద్ధి, భద్రత తెలుగుదేశం పార్టీ కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన టిడిపి కార్యకర్త కుటుంబానికి
ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

# అప్పు చేసి రాజధాని నిర్మాణం చేపట్టడం విడ్డూరం

- ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- తప్పుడు కేసులు పెడితే సహించం
- వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వి మోహన్‌రెడ్డి



విలేకరి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వి మోహన్‌రెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో నరేంద్రమోడీ రాష్ట్ర అభివృద్ధికి అప్పులు తప్ప ఏమి ఇవ్వడం లేదని, లక్ష కోట్ల అప్పు తెచ్చి రాజధాని నిర్మాణం చేపట్టడం విడ్డూరంగా ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్వి కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నందు కెఎంసి మేయర్ బివై రామయ్య, కార్పొరేటర్లతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలో ప్రధాని మోడీ పర్యటన హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014లో చంద్రబాబు హయాంలో పిడికెడు మట్టి, చెంబు నీళ్లు తీసుకొచ్చిన నరేంద్రమోడీ మరల ఇప్పుడొచ్చి ఏమి చెయ్యబోతున్నారో తెలియజేయాలన్నారు. మోడీ పర్యటనకు 6వేల బస్సులను ఉపయోగించి ప్రజలకు ఇక్కట్లు పెట్టడమే కాకుండ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారన్నారు. నరేంద్రమోడీ–చంద్రబాబులు మారువాడి వ్యాపారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ భవనాలను నిర్మాణాల పేరుతో కమీషన్ పేరుతో రూ.కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. ప్రధాని మోడీ పర్యటనలో రాష్ట్రానికి ఏమి తీసుకొస్తారో బాబు చెప్పాలన్నారు. రాజధాని నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదని లక్షల కోట్లు అప్పులు వద్దని తాము ఆరోపిస్తున్నామన్నారు. వైసిపి పార్టీ అభివృద్ధి వికేంద్రీకరణ కోసం ప్రయత్నాలు చేసిందని అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రాంతాల మధ్య వివాదం ఉండకూడదన్నదే మా ఉద్దేశ్యమన్నారు. కెఎంసి సర్వసభ్య సమావేశంలో తమ పార్టీకి చెందిన కార్పొరేటర్ కుర్చీ విసిరేసిన ఘటనలో మున్సిపల్ అధికారులు, టిడిపి కార్పొరేటర్లు తప్పుడు కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. ఫిర్యాదులో దెబ్బలు తగిలాయని తెదేపా నాయకులు చెప్పారని ఎవరికి దెబ్బలు తగిలాయో చూపించాలని డిమాండ్ చేశారు. తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం మేయర్ బివై రామయ్య మాట్లాడుతూ నరేంద్రమోడీ రాష్ట్ర అభివృద్ధికి అప్పులు తప్ప ఏమీ ఇవ్వడం లేదని విమర్శించారు. కేవలం రాజధాని పేరుతో రెండు జిల్లాలను అభివృద్ధి చేస్తున్నారు తప్ప వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి మాత్రం ముందుకు రావడం లేదని అన్నారు. రాయలసీమ ప్రాంత వాసి సిఎంగా చంద్ర బాబు ఉన్నప్పటికీ అభివృద్ధి దిశగా అడుగులు వేయకపోవడం బాధాకరమ న్నారు. వైకాపా బి ఫాంపై కార్పొరేటర్‌గా గెలిచి వైకాపా నుంచి స్టాండింగ్ కౌన్సిల్ కమిటీ సభ్యుడుగా గెలిచి టిడిపి కార్పొరేటర్ అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ధనార్జనే ధ్యేయంగా పార్టీ మారడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

# 6వ తరగతి ప్రవేశ పరీక్ష మెరిట్ లిస్ట్ విడుదల

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు మెరిట్ లిస్ట్ విడుదలైనట్లు ఓర్వకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జోషిలా వాట్స్ తెలిపారు. ఏపి విద్యా శాఖ కమీషనర్ ఆదేశం మేరకు ఏప్రిల్ 21న జరిగిన ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదర్శ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిమిత్తం అందుబాటులో ఉంచడం జరిగిందని ఈ మెరిట్ లిస్ట్‌లో ఉన్న విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సెలెక్షన్ లిస్ట్‌ను తయారు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలన్నారు.

# ఫైనల్ మెరిట్, సెలక్షన్ లిస్టు విడుదల

**– 6 నుండి 8వ తేదీ వరకు కౌన్సిలింగ్**

**– కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, కర్నూలుకు సంబంధించిన ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు గత నెల 29న జారీ చేసిన నోటిఫికేషన్ నెం. 01/2024నాలుగు కేటగిరిలు (మెడికల్ , అనెస్తీసియా టెక్, ఓ.టి అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అటెండెంట్) పోస్టుల ఫైనల్ మెరిట్, సెలక్షన్ లిస్టు విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లా కలెక్టర్ ఆమోదంతో, కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్స్ నందు అప్‌లోడ్ చేయడం జరిగిందని ఎంపికైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు రెండు సెట్స్ జిరాక్స్‌తో ఈ నెల 6నుండి 8వ తేదీ వరకు ఉదయం 10గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ కార్యాలయం నందు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. హాజరు కాని అభ్యర్థుల ఎంపిక రద్దు చేయబడుతుందన్నారు. అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా మీరు సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ కం రోస్టర్ విధానంలో చేయడం జరిగిందని ఎలాంటి అపోహలకు తావులేదన్నారు. ఎవరైనా అభ్యర్థులకు ఫోన్‌లు చేసి ప్రలోభాలకు గురి చేస్తే కంప్లైంట్ చేయాలని అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికేట్లన్నీ ఆయా యూనివర్సిటీలకు పంపి పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేస్తామని తప్పులు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బాలికల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి – కలెక్టర్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** కిశోరి వికాసం ద్వారా బాలికల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కిశోరి వికాసం–వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రణాళిక పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత వంటి 12అంశాలపై బాలికలకు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. మే 2నుండి జూన్ 10వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బాల్య వివాహాలు, బాలల హక్కుల చట్టం గురించి పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి నిర్మల, డిఎంహెచ్ఓ శాంతికళ, డిసిపిఓ శారద, లీగల్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, సామాజిక కార్యకర్త నరసింహులు, కౌన్సిలర్ నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ళు అరెస్ట్..

**రూ.4,100 నగదు.. మూడు బైక్‌లు స్వాధీనం**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని స్థానిక పెద్దమ్మకొండ సమీపంలో పేకాట ఆడుతున్న 7 మందిలో ఆరుగురు పరారైయ్యారని, వారి నుండి రూ.4,100లు నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించి, దాడిలో పేకాట ఆడుతున్న ఒకరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రూ.4,100లు నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన ఆరుగురు పరారైయ్యారని, వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.